క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఏరియా కమిటీ


ఏరియా అధ్యక్షుడిగా ఎన్నికైన సుదర్శన్

మందమర్రిరూరల్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏరియా కమిటీ ఎన్నిక ఏరియాలోని సంఘం కార్యాలయంలో ఆ సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ తిరుపతి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఏరియా ఉపాధ్యక్షుడిగా దాసరి సుదర్శన్, కార్యదర్శులుగా నాయిని శ్రీనివాస్, రామటెంకి వెంకటయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పురుషోత్తం, కోశాధికారిగా యేడుకోలు శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రెటరీలుగా సీపెల్లి రాయలింగు, రాజేందర్, లింగాల కిరణ్, ఈద పోచయ్య, వీస్‌రా మారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కందేరా జేకుమార్, రాదండి లక్ష్మణ్, అరుగురాల రాజ్‌కుమార్, చిలుముల నర్సయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జీలుగా మంతెన భాస్కర్, సంగి రవికుమార్, అలాగే కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులుగా జీడి బాపు, ఆసం శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రాజేశ్వర్ హాజరై కమిటీని ప్రకటించారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి


నినాదాలు చేస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మండలంలోని నాయకులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింత అశోక్, ఎండీ ఆరీఫ్, రాయలింగు, స్వామి, కిషన్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాసిపేట: కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరివల్ల టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద ఎన్నికల నేపథ్యంలో ఆదివారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి చెక్‌పోస్టును సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి నగదు తరలింపులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తనిఖీ చేసే సమయంలో సిబ్బందికి సహకరించాలని, రూ.50వేలకు మించి నగదు ఉన్నట్లయితే పూర్తి ఆధారాలు చూపించాలన్నారు. తనిఖీ చేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల ఆల్ టూ వీలర్స్ మెకానిక్ సొసైటీ ఆధ్వర్యంలో మెకానిక్ జ్యోతి–శంకర్‌ల కుమార్తె అంజలి వివాహానికి ఆదివారం రూ. 40 వేలు ఆర్థిక చేయూత అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు తోడేటి బాబు, ఉపాధ్యక్షుడు జాఫర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమెల చంద్రమౌళి, పట్టణ మెకానిక్‌లు రవీందర్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మందమర్రిలో...

మందమర్రిరూరల్: పట్టణంలోని అంగడి బజార్ సీఎస్పీ రోడ్డు ప్రాంతానికి చెందిన పాగిడి రాంబాబు కూతురు గంగోత్రి వివాహానికి మేముసైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు దాతల నుంచి సేకరించిన రూ.11వేలు నగదు, 25కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బూబత్తుల శ్రీనివాస్, సభ్యులు సోమయ్య, రవి, ఆరంగ పాణి, సాయికృష్ణ ఉన్నారు.

'కార్మికుల పర్మినెంట్‌కు చర్యలు తీసుకోవాలి'

పాతమంచిర్యాల: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్‌కు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చాంద్‌పాషా, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లాల్‌కుమార్ పాల్గొన్నారు.

భవిష్యత్తుకు భరోసా

- కేజీబీవీలో మెరుగైన విద్య
- ఇంగ్లిష్ మీడియంలో బోధన.. డిజిటల్ తరగతుల నిర్వహణ
- వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న కస్తూరిబా విద్యార్థినులు


పెంచికల్‌పేట్‌లోని కస్తూరిబా పాఠశాల


జిల్లా విద్యాధికారి అశోక్ చేతుల మీదుగా రెండో బహుమతి అందుకుంటున్న శ్రావ్య (ఫైల్)

పెంచికల్‌పేట్: నిరుపేద విద్యార్థినులను అక్కున చేర్చుకుంటూ చదువుతో పాటు ఆటపాటలు నేర్పిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుంది మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 200 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో డిజిటల్ బోధన, కోడింగ్, రీడింగ్ చాలెంజ్ ప్రోగ్రాంలతో పాటు ఆటపాటలు, డ్రాయింగ్ వంటి వాటిలోనూ విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నారు. మరోవైపు ఏటా నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఇక్కడి విద్యార్థినులు ప్రతిభ చాటుతున్నారు. ఇటీవల జరిగిన కళోత్సవాల్లో జిల్లాస్థాయిలో పాఠశాలకు చెందిన శ్రావ్య రెండో బహుమతి సాధించింది. బాలికలను డిజిటల్ తరగతులతో పాటు ఇతర కార్యక్రమాల్లో భాగస్వాములు చేస్తూ విద్యార్థినుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయినులు కృషి చేస్తున్నారు.

డిజిటల్ తరగతులు..

విద్యార్థులకు పాఠ్యాంశాలను కేవలం ఉపన్యాస పద్ధతిలో బోధించడం మాత్రమే కాకుండా ఆయా తరగతుల విద్యార్థినులకు డిజిటల్ తరగతులను బోధిస్తూ విద్యార్థినుల్లో చదువులపై ఆసక్తి పెంచుతున్నారు. పాఠ్య కార్యక్రమాలతో పాటు ప్రాజెక్టు కార్యక్రమాలు, జట్టు కృత్యాలను అందిస్తూ విద్యార్థినుల మధ్య పరస్పర సహకార ధోరణి అలవరుస్తూ అభ్యాసనం పట్ల ఆసక్తిని రేకెత్తించడానికి ఉపాధ్యాయినులు నిత్యం కృషి చేస్తున్నారు.

ఆటపాటలు.. యోగా..

పాఠశాలలో నిత్యం ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యార్థినులకు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయిస్తూ విద్యార్థినుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తున్నారు.

బాగా చదివి టీచర్ అవుతా



పాఠశాలలో ఉపాధ్యాయులు డిజిటల్ పద్ధతిలో బోధన అందిస్తున్నారు. ప్రాజెక్టు పద్ధతిలో పాఠాలను బోధిస్తున్నారు. ప్రతిరోజు పాఠ్యాంశాలను కృత్యాల ద్వారా సులభంగా అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు. భవిష్యత్తులో టీచర్ ఉద్యోగం సాధిస్తాను.

– అలేఖ్య, 10వ తరగతి

ప్రతిభను గుర్తిస్తున్నాం

విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులను గ్రూపులుగా తయారు చేసి వారిలో ఉన్న సమస్యలను గుర్తిస్తున్నాం. ప్రతిభ ఆధారంగా వారిని ఉన్నత తరగతులకు సిద్ధం చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. విద్యార్థినుల్లో స్నేహపూరిత వాతావరణం పెంపొందించి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతున్నాం.

– శారద, ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి, కేజీబీవీ, పెంచికల్‌పేట్

విద్యార్థులకు స్వెట్టర్లు అందజేత


విద్యార్థులకు స్వెట్టర్లు అందిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఎస్సీబాలుర వసతి గృహం విద్యార్థులకు ఆదివారం స్వెట్టర్స్, స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేశారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వసతి గృహంలో ఉండి పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు చలి తీవ్రతను తట్టుకునేందుకు, క్రీడల్లో రాణించేందుకు ఉపయుక్తంగా ఉంటుందనే ఉద్దేశంతో స్వెటర్స్, క్రీడా పోటీల నిర్వహణ కోసం స్పోర్ట్స్ షూస్‌ను అందించినట్లు షెడ్యూల్డ్ కులాల జిల్లా ఉపసంచాలకులు పి.రవీందర్ రెడ్డి తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ ఆల్ఇన్ వన్ పుస్తకాలను సరఫరా చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చదువులో, క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం.రవీందర్, వసతి గృహం సంక్షేమ అధికారి వి.విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

'నోటుకు ఓటు అమ్ముకోవద్దు'


ప్రచారం చేస్తున్న జైభారత్ సభ్యులు

మంచిర్యాలటౌన్: నోటుకు ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్తు అధోగతేనని, ఓటు అమ్ముకున్నవారు శవంతో సమానమంటూ ఆదివారం జైభారత్ సంస్థ సభ్యులు జిల్లా కేంద్రంలో పోస్టర్లను విడుదల చేసి, ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో నాయకులు చూపే డబ్బుకు ఆశ పడితే మరో ఐదేళ్లు మోసపోవడం ఖాయమని, ధన ప్రలోభంతో ఓట్లను కొనుగోలు చేసేందుకు పలువురు ప్రయత్నిస్తారని, ప్రజాస్వామ్య పరిరక్షణపై ఓటర్ల బాధ్యతను చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతో ప్రచారం చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సుధాకర్, ఆంజనేయులు, కిరణ్, సంతోశ్ పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల కార్యాలయం ప్రారంభం


ప్రారంభిస్తున్న అనంతుల శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో ఆదివారం జాతీయ మానవ హక్కులు, మహిళా, శిశు సంరక్షణ జిల్లా కార్యాలయాన్ని ఫౌండర్, చైర్మన్ అనంతుల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా సామాన్య, మధ్య తరగతి ప్రజల హక్కులను కాపాడడంలో ముందుంటామని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా తాము పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోరె శ్రీనివాస్, సభ్యులు మల్ల శ్రీనివాస్, రాసపెల్లి కుమార్, రాజమొగిలి, తిరుపతి, రమేశ్, ప్రభాకర్, శ్రీకాంత్, మణికంఠ, రాజు, రాజేందర్, యశ్వంత్, సంపత్ పాల్గొన్నారు.

ఎండుతున్న మొక్కలు


క్రీడా మైదానంలో ఎండుతున్న మొక్కలు

మంచిర్యాలటౌన్ జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల క్రీడా మైదానంలో ఇటీవల హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు నీరు పోయక ఎండి పోతున్నాయి. ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉండడం, మొక్కలకు నీరు పోస్తున్నారో లేదో పట్టించుకోకపోవడంతో నాటిన మొక్కలు ఎండుతున్నాయి. వర్షాకాలం పూర్తయ్యి, చలికాలం ప్రారంభంలో ఉండగా, మధ్యాహ్నం ఎండ వేడి ఎక్కువగా ఉంటుంది. దీంతో మొక్కలకు నీరు అందక, ఎండ వేడికి ఎండుతున్నా, పట్టించుకునే వారు లేరు. మొక్కలకు నీరు పోయకుంటే, నాటిన మొక్కలు మొత్తం ఎండిపోయే అవకాశం ఉందని, మొక్కలకు నీరు పోసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న రవికిరణ్ యాదవ్

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఎంబ్రైడరీ, మగ్గంవర్క్ అంశాల్లో శిక్షణ పొందిన వారికి ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ట్రస్ట్ ద్వారా మూడు నెలల పాటు శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. నవీన్ యాదవ్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

మిథ్యగా కంప్యూటర్ విద్య


సుర్దాపూర్ పాఠశాలలో నిరుపయోగంగా కంప్యూటర్లు

- నిరుపయోగంగా కంప్యూటర్లు
- సాంకేతిక విద్యకు విద్యార్థులు దూరం

కెరమెరి: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కంప్యూటర్ విద్యా బోధన అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు గతంలో మంజూరు చేసిన కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. పాఠశాలల్లో కంప్యూటర్ విద్య బోధించే వారు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని విధాల బోధనా సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టింది. ఇందుకు లక్షల రూపాయలు వెచ్చించి కంప్యూటర్లు మంజూరు చేసింది. వాటికి కావాల్సిన సామగ్రి అందించింది. కానీ ఈ విద్యను అందించడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం విఫలమవుతోంది.

అలంకార ప్రాయంగా కంప్యూటర్లు

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల కెరమెరి, ప్రాథమికోన్నత పాఠశాల సుర్దాపూర్, ఝరిలలో 2017లో మంజూరు చేసిన కంప్యూటర్లు అలంకార ప్రాయంగా మారాయి. దీంతో విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. మండల కేంద్రంలో మంజూరైన కంప్యూటర్లు ఏడాది మాత్రమే పని చేయగా మిగితా పాఠశాలల్లో మంజూరైనప్పటి నుంచి నిరుపయోగంగానే మారాయి.

ఇన్‌స్ట్రక్టర్ల కొరత..

పాఠశాలల్లో కంప్యూటర్లను మంజూరు చేయడమే తమ వంతు అనుకున్న అధికారులు ఇన్‌స్ట్రక్టర్లను నియమించలేదు. ఉపాధ్యాయులకు కూడా కంప్యూటర్ల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. ఒక్కో పాఠశాలలో 5 నుంచి 10 కంప్యూటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్న చిత్తశుద్ధి అధికారుల్లో లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి

కంప్యూటర్ విద్య అందించేందుకు ఇన్‌స్ట్రక్టర్లు లేకపోవడంతో పలు పాఠశాలల్లో కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు కంప్యూటర్ విద్య చాలా అవసరం. విద్యాశాఖ అధికారులు వెంటనే కంప్యూటర్ బోధకులను నియమించాలని కోరాం.

– ఆదే ప్రకాశ్, ఎంఎస్‌వో, కెరమెరి

ఆకాశాన్నంటిన పప్పుల ధరలు


పప్పుదినుసులు

- రూ.180కి చేరిన కంది పప్పు
- పెరిగిన ఇతర పప్పుదినుసుల ధరలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న జిల్లావాసులు

కౌటాల: నిత్యావసరాల్లో ప్రధానమైనవి పప్పుదినుసులు. కొంత మందికి ప్రతిరోజు పప్పు కూర లేనిదే నోట్లో ముద్ద దిగదు. అలాంటిది ప్రస్తుతం పప్పులు ధరలు భారీగా పెరగడంతో పప్పన్నం తినాలంటే ప్రజలు వెనుకంజ వేసే పరిస్థితి నెలకొంది. గతంలో దేశవ్యాప్తంగా పప్పుదినుసుల ఉత్పత్తులు పెరగడంతో పప్పుల ధరలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం పప్పుదినుసుల ధరలు చుక్కలనంటుతున్నాయి. మార్కెట్‌లో కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్న ప్రస్తుత తరుణంలో పప్పుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

పెరిగిన ధరలు

ప్రస్తుతం పప్పు దినుసుల ధరలు అమాంతంగా పెరగడంతో ప్రజలు కొనుగోళ్లు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన పప్పుల ధరలతో జిల్లాలోని పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పప్పు లేకుండానే భోజనం చేయాల్సి వస్తుందని పేద ప్రజలు వాపోతున్నారు. రోజంతా కూలీ చేసినా కూడా కిలో పప్పు కొనలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఈ సీజన్‌లో కూరగాయల ధరలు తక్కువగా ఉండాలి. కానీ ప్రస్తుతం ధరలు మండుతున్నాయి. ఉల్లిగడ్డల ధరలు పెరగడంతో పాటు ఇతర కూరగాయల ధరలు పెరగడంతో జిల్లావాసులు ఇబ్బందులు పడుతున్నారు.

మార్కెట్‌లో పప్పుల ధరలు (కిలో)..

రకం	గతేడాది ధర	ప్రస్తుత ధర
కంది	రూ.120	రూ. 180
పెసర	రూ. 100	రూ. 120
శనగ	రూ. 70	రూ. 90
మినపప్పు	రూ. 120	రూ. 150
మైసూర్‌పప్పు	రూ. 80	రూ. 95
బబ్బెరపప్పు	రూ.60	రూ. 75

తగ్గుతున్న ఆహార పంటల సాగు..

జిల్లాలో గతంలో రైతులు వేల ఎకరాల్లో పప్పు దినుసుల పంట సాగు చేసేవారు. కానీ వాతావరణం అనుకూలించకపోవడం.. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో ప్రస్తుతం రైతులు వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 40వేల ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. ఇతర పప్పుధాన్యాల పంటల సాగు క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గతంలో కంది పంటను రైతులు వేల ఎకరాల్లో సాగు చేసేవారు. కానీ పంటకు విపరీతమైన తెగుళ్లు సోకుతుండడంతో రైతులు కంది పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. కొద్ది ఎకరాల్లో మాత్రమే సాగవుతున్న పంట సరిగా దిగుబడి రాక మార్కెట్‌లో కంది పప్పు ధర ఆకాశన్నంటుతోంది.

ధరల నియంత్రణేది..?

ప్రస్తుతం పప్పు దినుసుల ధరలు భారీగా పెరగడంతో పప్పులు కొనడానికి ప్రజలు ముందుకు రావడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పప్పుల అమ్మకాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. పప్పుల ధరలు అమాంతంగా పెరిగినా వాటి నియంత్రణలో అధికార యంత్రాంగం విఫలమైందని ఆరోపిస్తున్నారు. పప్పుల ధరలు నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లావాసులు పేర్కొంటున్నారు.

డబ్బులు సరిపోతలేవు

పొద్దంతా కూలీ పని చేయగా వచ్చిన డబ్బులతో సరిపడా నిత్యావసర సరుకులు కొనలేకపోతున్నాం. రోజు మొత్తం పని చేస్తే రూ.250 ఇస్తున్నారు. నిత్యావసర సరుకుల కొనుగోలుకు రూ.500పైనే అవుతున్నాయి. ప్రస్తుతం కూరగాయల, పప్పుదినుసుల ధరలను వెంటనే తగ్గించాలి. రేషన్‌షాపుల్లో నిత్యావసర సరుకులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– జాడి గున్నబాయి, గంగాపూర్, చింతలమానెపల్లి

ఇబ్బందులు పడుతున్నాం

ప్రతీ సంవత్సరం పండుగలు వస్తున్నాయంటే చాలు పప్పుల ధరలు పెరిగిపోతాయి. దీంతో తమ సంపాదన అంతా పప్పు, ఉప్పులకే సరిపోతుంది. పప్పుదినుసుల ధరలు అమాంతంగా పెరగడంతో ఇబ్బంది పడుతున్నాం. దీంతో పప్పు లేకుండానే భోజనం చేస్తున్నాం.. పప్పుల ధరలు పెరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నక్క శంకర్, కౌటాల

కార్యవర్గం ఎన్నిక

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మాంగ్ సమాజ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా అధ్యక్షుడు గాడీకర్ పరుశురాం మాంగ్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అంకుష్, ఉపాధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా హరిదాస్, కోశాధికారిగా జ్ఞానేశ్వర్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా జయంతి వేడుకలు


వేడుకలో పాల్గొన్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సహస్రార్జున జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఎస్ఎస్‌కే పట్కరి కులసంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గంగమోహన్, షికారి రమేశ్, శికారి రవి, శికారి పవన్, దొండి ప్రకాశ్, శ్రీను, లక్ష్మీనారాయణ, మండి దత్తు, శంకర్, హరికృష్ణ, నందు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాజ్యలక్ష్మి

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన తాళ్లపల్లి లలితబాయి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీజేపీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్, నాయకులు ఎల్ములే మల్లయ్య, బాజీరావు, భీమ్‌రావు, మధుకర్, శ్రీకాంత్, విశ్వనాథ్, భారత్, సునీల్ ఉన్నారు.